అంతర్జాతీయ నగరంగా విశాఖి

- అదే సీఎం వైఎస్ జగన్ లక్ష్యం
- మేయర్ హరివెంకటకుమారి

సింహాచలం: విశాఖను అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి అన్నారు. జీవీఎంసీ 96వ వార్డులో 2 కోట్ల 5లక్షల 95వేలతో చేయనున్న అభివృద్ధి పనులకు శనివారం ఆమె పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. పలుచోట్ల శిలాఫలకాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విశాఖకు అంతర్జాతీయంగా గుర్తింపు తీసుకురావాలన్న ధ్యేయంతో అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. పెందుర్తి నియోజకవర్గంలోని జీవీఎంసీ వార్డుల్లో పలు అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు.

ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా చేసుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీటవేస్తున్నారని చెప్పారు. అభివృద్ధి విషయానికి వచ్చేసరికి పార్టీలకతీతంగా ప్రజా ప్రతినిధులు కలసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. 96వ వార్డులో 2కోట్లకు పైగా నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో 96వ వార్డు కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి అజయ్‌రాజ్, పార్టీ నాయకులు బైలపూడి భగవాన్ జయరామ్, గొర్లె రామునాయుడు, శరగడం నర్సింహమూర్తి, దొగ్గ గౌతమ్, లెక్కల రమేష్, దాడి ఉమా మహేష్, కిల్లి అప్పారావు, లాలం అప్పల నాయుడు, అల్లం అప్పారావు, బంగారు నాయుడు, రొంగలి శంకర్ పాల్గొన్నారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ హరివెంకట కుమారి, ఎమ్మెల్యే అదీప్‌రాజ్

చేపట్టనున్న అభివృద్ధి పనుల వివరాలు

- గాంధీనగర్‌లో రూ.19.94లక్షలతో సీసీ డ్రైన్లు, సీసీ రోడ్ల నిర్మాణం
- దగ్గువానిపాలెంలో రూ.19.93లక్షలతో సీసీ రోడ్లు
- వెలంపేటలో రూ.19.9లక్షలతో సీసీ రోడ్లు
- సాయినగర్(టీచర్ లేఅవుట్)లో రూ.19.89 లక్షలతో సీసీ రోడ్లు
- నల్లక్వారీ ప్రాంతంలో రూ.19.91లక్షలతో సీసీ రోడ్లు
- సూర్యనగర్‌లో రూ.19.33 లక్షలతో సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లు
- గాంధీనగర్‌లో రూ.18.97లక్షలతో సీసీ రోడ్లు
- నేతాజీనగర్, వీరభద్రనగర్‌లో రూ.13.25లక్షలతో సీసీ రోడ్లు, కల్వర్టులు
- రాయుడువారి కళ్లాలు నుంచి రైల్వేస్టేషన్ వరకు రూ.19.67లక్షలతో సీసీ డ్రైన్లు, సీసీ కల్వర్టుల
- సాయినిరంజన్ కాలనీలో రూ.19.79 లక్షలతో సీసీ రోడ్లు
- రొంగలి వీధిలో రూ.15.37 లక్షలతో సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లు.

క్లుప్తంగా

వైభవంగా నిత్య కల్యాణం


యజ్ఞోపవీత ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ బేడా మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయ దాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

వెంకన్నను దర్శించుకున్న మేయర్ గొలగాని


వెంకన్నను దర్శించుకుంటున్న మేయర్ హరి వెంకటకుమారి దంపతులు

సింహాచలం: వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి దంపతులు స్వామిని దర్శించుకున్నారు. వారి పేరిట ప్రధానార్చకులు రామానుజమ్ స్వామికి పూజలు చేశారు.

ఓటు హక్కు నమోదుపై అవగాహన


విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న బీజేపీ నాయకులు

సింహాచలం: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం వంటిదని పెందుర్తి నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ గొర్లె రామునాయుడు అన్నారు. ఆ పార్టీ నాయకులు శనివారం పెందుర్తిలోని బాలాజీ డిగ్రీ కళాశాల, పినగాడిలోని మహాత్మా గాంధీ నర్సింగ్ కళాశాలల్లో ఓటర్ చేతన అభియాన్ నిర్వహించారు. పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు ఓటు హక్కు ప్రాధాన్యతను తెలియజేశారు. అలాగే కొత్త ఓటర్ల నమోదు చేశారు. చిరునామాల మార్పు, ఫోన్ నెంబర్ అప్‌డేట్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రామునాయుడు మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటరుగానమోదు కావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఓబీసీ జనరల్ సెక్రటరీ ఎర్ర అచ్చెంనాయుడు, రూరల్ మండల అధ్యక్షుడు కాళ్ల జగన్‌మోహన్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శిగా నాగేశ్వరరావు



అగనంపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శిగా పరవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్, లంకెలపాలేనికి చెందిన ఎం.వి.నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి వెంకట లక్ష్మమ్మ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు పనిచేసిన ఎ.శేఖర్‌కు ప్రధానోపాధ్యాయునిగా పదోన్నతి రావడంతో ఆయన స్థానంలో నాగేశ్వరరావును నియమించారు. ఆయన రెండేళ్ల పాటు ఈ పదవిలో ఉంటారు. నాగేశ్వరరావుకు పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.గోపీనాథ్, సీహెచ్.పెద్దినాయుడు, లంకెలపాలెం హైస్కూల్ హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు అభినందనలు తెలిపారు.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

సింహాచలం: పెందుర్తి వెలంపేటలోని ఓ లాడ్జిలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను శనివారం అదుపులోకి తీసుకున్నట్టు నగర టాస్క్‌ఫోర్స్ అసిస్టెంట్ కమిషనర్ ఎ.త్రినాథరావు తెలిపారు. వారి నుంచి రూ. 80వేల నగదు, నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని పెందుర్తి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్టు పేర్కొన్నారు.

మదర్ థెరిసా సేవలు స్ఫూర్తిదాయకం


మదర్ థెరిసా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైస్ ప్రిన్సిపాల్ శంకర్ తదితరులు

సబ్బవరం: మదర్ థెరిసా అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శంకర్ అన్నారు. కళాశాలలో శనివారం మదర్‌థెరిసా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సృష్టి ఉన్నంత వరకూ ఆమె స్మరణీయురాలని కొనియాడారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ లెక్కల గణేష్,అధ్యాపకులు వీవీ గోపాలస్వామి,సత్యం,గోవింద్,రామకృష్ణ,స్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయ ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

పరవాడ: మండల కేంద్రమైన పరవాడ సంతబయలులో శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజా కార్యక్రమాన్ని వేదపండితులు శ్రీమాన్ రేజేటి రామాచార్యులు(రాంబాబు)ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు, సర్పంచ్ సిరపరపు అప్పల నాయుడు దంపతులు, మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు దంపతులు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువత పాల్గొన్నారు.


అభయాంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న గ్రామ పెద్దలు

‘ఉక్కు’ ప్రైవేటీకరణపై కేంద్రం పునరాలోచించాలి


దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విషయాన్ని కార్మికుల భవిష్యత్తు కోసం పునరాలోచించాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారానికి 926వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సంస్థకు చెందిన ఆర్ అండ్ డీ, టెలికాం, ఈటీఎల్ విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామని పార్లమెంట్‌లో ప్రకటన చేయాలని కోరారు. లేని పక్షంలో బీజేపీకి వచ్చే ఎన్నికల్లో డిపాజిట్లు కూడా దక్కవని హెచ్చరించారు. భారత రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ ప్రధాని మోదీ తన నిరంకుశత్వ పాలనతో అన్యాయంగా విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. దేశంలో సంపద సృష్టించలేని బీజేపీ ప్రభుత్వానికి దేశ సొత్తు అయిన ప్రభుత్వరంగ సంస్థలను అమ్మే హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. ప్లాంటును పూర్తి స్థాయి ఉత్పత్తి దిశగా నడపవలసిన యాజమాన్యం కావాలనే నష్టాల వైపు నెట్టే ప్రయత్నాలు చేస్తోందన్నారు. ఇకనైనా కుటిల రాజకీయాలను వదిలి, స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి ఉత్పత్తి దిశగా నడపాలని డిమాండ్ చేశారు.

ఏయూలో ఆంగ్ల పుస్తకావిష్కరణ

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వ విద్యాలయం ఆంగ్ల విభాగం అధ్యాపకులు డాక్టర్ ఎస్. రవి విన్సెంట్ రచించిన గ్లీనింగ్స్ ఆఫ్ గేజింగ్ పుస్తకాన్ని వర్సిటీ ఉపకులపతి ఆచార్య పి.వి.జి.డి. ప్రసాద్‌రెడ్డి శనివారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆంగ్ల విభాగం ఆచార్యులు డాక్టర్ ఎస్. సాల్మన్ బెన్నీ ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ పుస్తకంలో ప్రజాస్వామ్య ఉల్లంఘన, జీవితంలో, సమాజంలోని రుగ్మతలు, సమస్యాత్మక వ్యాధులు, మూఢ నమ్మకాలు, పోలికలు- వైరుధ్యాలు, ఆశతో కూడిన దుర్భర జీవితాలు, అశాంతి, జింగోయిజం వంటి విభిన్న ఇతివృత్తాలను డాక్టర్ ఎస్. రవి విన్సెంట్ ఉద్వేగభరితంగా వివరించారు. యుద్ధ ప్రభావం, మానవ జీవితంలో వివిధ రూపాల్లో బాధలు, ప్రేమ కోసం వాంఛ, ప్రపంచంలోని అసమానతలు వంటి అనేక సమస్యలు ఈ పుస్తకంలో రచయిత చర్చించారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

100 శాతం ప్రవేశాలపై సర్వే జరపాలి

డీఈవో చంద్రకళ

ఆరిలోవ: సచివాలయాల ఎడ్యుకేషన్ కార్యదర్శులు గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో (జీఈఆర్-స్కూల ప్రవేశాల నిష్పత్తి) సర్వే 100 శాతం జరపాలని డీఈవో లెంక చంద్రకళ తెలిపారు. జీవీఎంసీ జోన్-2 పరిధి బోరవానిపాలెం, రాజీవ్ గృహకల్ప, జీఎస్‌వో లేఅవుట్, మారికవలస, వాంబేకాలనీ తదితర సచివాలయాలను ఆమె శనివారం సందర్శించి, ఎడ్యుకేషన్ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి క్లస్టర్‌లో జీఈఆర్ 100 శాతం సాధించే విధంగా కృషి చేయాలని వారికి సూచించారు. అనంతరం బోరవానిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆమె సందర్శించారు. అక్కడ పాఠశాల పరిస్థితి, గదులు, విద్యార్థుల సంఖ్య, మధ్యాహ్న భోజనం, పూర్తయిన సిలబస్ తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా తరగతి గదులకు వెళ్లి విద్యార్థులను పలకరించారు. వారి వర్క్‌బుక్స్ పరిశీలించారు. క్రమశిక్షణతో చదువుకోవాలని, రోజూ పాఠశాలకు హాజరు కావాలని విద్యార్థులకు సూచించారు.


బోరవానిపాలెం పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

కొనసాగిన వాహనాల తనిఖీ

గోపాలపట్నం: అనుమతి లేకుండా కార్లకు గౌట్ డ్యూటీ, రవాణా శాఖ... ప్రొటోకాల్ వెహికల్ వంటి ప్రత్యేక బోర్డుల ఏర్పాటుపై ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. పలు వాహనాలను నిలిపి ఆయా బోర్డులు ఎందుకు పెట్టారు.., ఏవిధమైన అనుమతులు ఉన్నాయో ఆరా తీశారు. అనుమతులు లేని వాహనాల నుంచి ఆయా బోర్డులను తొలగించారు. హైసెక్యూరిటీ నంబర్ బోర్డులు కాకుండా డిజైన్ చేసిన నంబర్ బోర్డులను కూడా తొలగించారు.

ఆరో తరగతిలో ప్రవేశం


విద్యార్థి తల్లికి అడ్మిషన్ ఫారం అందజేస్తున్న హెచ్‌ఎం చిన్నమ్మాయి

సింహాచలం: గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో సర్వేలో భాగంగా శనివారం పెందుర్తి ప్రభుత్వ హైస్కూల్లో బి.ఎర్నినాయుడుకు ఆరో తరగతిలో ప్రవేశం కల్పించారు. ఈ మేరకు ఎర్నినాయుడు తల్లి వెంకటలక్ష్మికి ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ చిన్నమ్మాయి అడ్మిషన్ పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.నరసింగరావు, సీఆర్‌పీ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పైడితల్లమ్మ ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ


భూమిపూజ చేస్తున్న సురేష్ రాజ్ తదితరులు

సబ్బవరం: మండలంలోని ఆరిపాక శివారు లగిశెట్టిపాలెంలో గ్రామ దేవత పైడితల్లమ్మ ఆలయ పునర్నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్ శనివారం భూమి పూజ చేశారు. గ్రామ ప్రజలు,భక్తుల సహకారంతో త్వరితగతిన ఆలయం నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆరిపాక మాజీ సర్పంచ్ పాలిశెట్టి పైడిరాజు, మాజీ ఉప సర్పంచ్ కోటి రాజు, పెద్దలు ఎన్‌పీ రాజు, బంగారయ్య, రెడ్డి ఈశ్వరరావు, బండారు రమణ, పాల్గుణ, దేముడుబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ


విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న నాయుడు తదితరులు

సబ్బవరం: మండలంలోని సబ్బవరం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలోని విశ్రాంత ఉపాధ్యాయుడు బోకం శ్రీరాంమూర్తి(బీకే నాయుడు) శనివారం విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. పాఠశాలలోని సుమారు 115 మంది విద్యార్థులకు రూ.10 వేలు విలువ చేసే పెదబాల శిక్ష, సుమతీ శతకం,వేమన శతకం,నీతికథలు పుస్తకాలతో పాటు నోట్ పుస్తకాలను,పెన్సిళ్లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హేమలత, స్కూల్ కమిటీ ఛైర్మన్ లగిశెట్టి దేముడు బాడు, గ్రామ పెద్దలు గవర రాజు,పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూనియన్లకు గుర్తుల కేటాయింపు

అక్కిరెడ్డిపాలెం: భెల్‌లో ఈ నెల 31న జరగనున్న గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో పోటీలో నిలిచిన యూనియన్లకు గుర్తులు కేటాయించారు. రీజనల్ లేబర్ కమిషనర్ కె.జగన్నాథ్ మహంతి శనివారం వీటిని ప్రకటించారు. ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ పొత్తుతో పోటీలో నిలిచిన ప్రోగ్రెసివ్ ఫ్రంట్‌కు ఉదయించే సూర్యుడు గుర్తును, యునైటెడ్ ఫ్రంట్‌కు సింహం గుర్తును కేటాయించినట్టు తెలియజేశారు. బీఎంఎస్ కూడా పోటీలో ఉందని ఆ యూనియన్ ప్రతినిధులు తెలిపారు. ఎన్నికలు సమీపించడంతో యూనియన్లు ఆదివారం సమావేశాలు నిర్వహిస్తున్నాయి. ప్రోగ్రెసివ్ ఫ్రంట్ ఉదయం 11 గంటలకు గుర్తింపు యూనియన్ కార్యాలయంలో సమావేశం కానుంది.

సమరభేరి పోస్టర్ ఆవిష్కరణ

మద్దిలపాలెం: పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను నిరసిస్తూ ప్రభుత్వాలపై సమరభేరి మోగించనున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను పిఠాపురంకాలనీలో గల పార్టీ కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈనెల 30,31 తేదీల్లో పాదయాత్రలు, సంతకాల సేకరణ, సెప్టెంబర్ 1న సచివాలయాల వద్ద ధర్నా, 3వ తేదీన నిరుద్యోగ యూత్ మార్చ్, 4వ తేదీన తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేపట్టనున్నామన్నారు.

త్వరితగతిన ప్రభుత్వ భవనాల పూర్తి

మండల ప్రత్యేక అధికారి కిరణ్ కుమారి


మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి కిరణ్ కుమారి

సబ్బవరం: నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ భవనాలను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని మండల ప్రత్యేక అధికారి కిరణ్ కుమారి సూచించారు.స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆమె మండలంలోని పలు శాఖల అధికారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులతో పాటు సంక్షేమ పథకాల అమలుపై శాఖలవారీగా సమీక్షించారు. పలు గ్రామాల్లో చేపట్టిన గ్రామ సచివాలయాలు,రైతు భరోసా కేంద్రాలు,విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అధికారులు నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని సూచించారు. సచివాలయాలకు వచ్చే అర్జీలను సకాలంలో పరిష్కరించాలన్నారు. జగనన్న గృహ నిర్మాణాలు వేగవంతం అయ్యేలా సంబంధిత అధికారులు దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో ఏవో బాబూరావు,మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ, పంచాయతీ రాజ్ ఏఈ అర్జున అప్పారావు, హౌసింగ్ ఏఈ శేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హిమబిందు, ఎంఈవోలు లక్ష్మణరావు,సూర్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

ఏటీఎం కార్డు మార్చి టోకరా

వివిధ ఏటీఎంల ద్వారా రూ.60,500 విత్‌డ్రా

సబ్బవరం: ఏటీఎం మిషన్ వద్ద ఏటీఎం కార్డు మార్చి వివిధ ప్రాంతాల్లోని ఏటీఎంల నుంచి రూ.60,500 డ్రా చేసిన సంఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం కేసు నమోదయ్యింది. ఎస్‌ఐ అల్లు వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలు.. సబ్బవరం శివారు పెదనాయుడుపాలెం గ్రామానికి చెందిన బోకం ఈశ్వరమ్మ తన భర్త సన్యాసిరావుతో కలిసి ఈ నెల 24న డబ్బులు తీయడానికి సబ్బవరం ఎస్‌బీఐ ఏటీఎం మిషన్ వద్దకు వెళ్లారు. అయితే ఏటీఎం ద్వారా డబ్బులు తీయడం రాకపోవడంతో పక్కనే ఉన్న వ్యక్తికి కార్డు ఇచ్చి పిన్ నెంబర్ చెప్పి డబ్బులు తీసుకుని వెళ్లిపోయారు. వారు ఇంటికి వెళ్లిన తర్వాత వివిధ ఏటీఎంల నుంచి రూ.60,500 డ్రా చేసినట్లు మెసేజ్‌లు వచ్చాయి. దీంతో వెంటనే సబ్బవరం ఎస్‌బీఐ బ్రాంచ్‌కు వెళ్లి జరిగిన విషయం చెప్పారు. దీంతో బ్యాంకు అధికారులు ఏటీఎం కార్డు మారిపోయినట్లు గుర్తించి విషయం దంపతులకు తెలిపారు. మోసం జరిగినట్లు గుర్తించి బ్యాంకు సిబ్బంది స్టేట్‌మెంట్ తీయగా రాంపురం,విశాలాక్షినగర్, దొర ఫిల్లింగ్ స్టేషన్ వంటి పలు ఏటీఎంల నుంచి అదే రోజు రూ.60,500 డ్రా చేసినట్లు స్టేట్‌మెంట్‌లో వచ్చిందన్నారు. దీనితో బ్యాంకు అధికారులు అకౌంట్‌ను బ్లాక్ చేశారు. బాధితురాలు ఈశ్వరమ్మ శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.ఆయన మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులకు ఏటీఎం కార్డులు ఇవ్వకూడదని సూచించారు.

కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దు

డాక్టర్ ఐఆర్ రంజిత్

పరవాడ: మానవుడికి కంటి చూపు చాలా ముఖ్యమైనది.. దాని సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పరవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఐ.ఆర్.రంజిత్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అనకాపల్లి జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రతినిధులు ఆర్.రమణకుమార్, ఆప్తాలమిక్ అధికారి ఆర్.వెంకట్రావు ఆధ్వర్యంలో నేత్రదాన పక్షోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యుడు ఐ.ఆర్.రంజిత్ మాట్లాడుతూ పౌష్టికాహార లోపం, ఇన్ఫెక్షన్లు, కెమికల్ బర్న్స్, పుట్టుకతో వచ్చే లోపాలు, గాయాల కారణంగా కంటి చూపు పోగొట్టుకున్న వారికి నేత్రదానం చాలా అవసరమన్నారు. మనిషి మరణాంతరం 6 గంటల వ్యవధిలో కంటిలోని కార్నియా తీసి కంటి చూపు లోపించిన వ్యక్తికి అమర్చడం ద్వారా కంటి చూపును ప్రసాదించవచ్చునన్నారు. అన్ని దానాల్లో కన్నా నేత్రదానం గొప్పదన్నారు. ఎవరైనా మరణించినపుడు వారు నేత్రదానం చేసే విధంగా ఆ కుటుంబానికి అవగాహన కల్పించాలన్నారు. నేత్రదానం చేసే వారు ముందుగా నగరంలోని ఐ బ్యాంకులకు సమాచారం అందించాలని డాక్టర్ రంజిత్ సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ హారిక, సీహెచ్‌వో ఎం.ఎస్.ఎస్.సాయిరామ్, పీహెచ్ ఎన్. జానకీ రామన్, యూడీసీ ఆనందకుమార్, సిబ్బంది రాజేశ్వరి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.


పరవాడ పీహెచ్‌సీలో నేత్రదాన పక్షోత్సవాల పోస్టర్ ప్రదర్శిస్తున్న వైద్య సిబ్బంది

28న స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమావేశం

వ్యాయామ ఉపాధ్యాయులకు ఇక ప్రతీ నెల సమావేశాలు

అగనంపూడి: వ్యాయామ ఉపాధ్యాయులకు ఈ నెల నుంచి స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించనున్నట్లు అనకాపల్లి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు తెలిపారు. మిగిలిన సబ్జెక్టుల మాదిరిగానే ఇకపై వ్యాయామ అక్షరాస్యత (ఫిజికల్ లిటరసీ) సబ్జెక్టుకు కూడా ప్రతీ నెలా సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. లంకెలపాలెంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ పర్యవేక్షణలో ఈ నెల 28న జిల్లాలోని 7 నియోజకవర్గాల స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేస్తామని తెలియజేశారు. పెందుర్తి నియోజకవర్గానికి సంబంధించి పరవాడ, సబ్బవరం, పెందుర్తి మండలాల వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశం లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నామని తెలిపారు. వ్యాయామ విద్య పురోభివృద్ధి, క్రీడా పోటీలు, క్రీడా నిబంధనల్లో వస్తున్న మార్పులపై ఈ సమావేశంలో చర్చిస్తామని వివరించారు.

రెండో రోజుకు జనజాగరణ దీక్షలు


జనజాగరణ దీక్షలో పాల్గొన్న ఎన్‌సీఈ యూనియన్ సభ్యులు

సింధియా: డిఫెన్స్ కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో తూర్పు నావికాదళంలో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలపై చేపట్టిన రెండు దీక్షల్లో భాగంగా నౌకాదళ ప్రధాన కార్యాలయం ఎదుట శనివారం వంటావార్పు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఫెన్స్ కోఆర్డినేషన్ కమిటీ ఛైర్మన్ రెడ్డి వెంకటరావు మాట్లాడుతూ కమాండ్ పరిధిలోని దీర్ఘకాలిక సమస్యలైన వైద్య సదుపాయాలు, హెచ్‌ఆర్‌ఏ పెంపు, ఇంక్రిమెంట్లు, వేతన సవరణ వంటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమానికి వివిధ ట్రేడ్ యూనియన్ల నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సీఈ యూనియన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మారుతి, పి.నాగేశ్వరరావు, ఇతర యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

టైం అడిగి.. సెల్‌ఫోన్ లాక్కొని పరారీ

గోపాలపట్నం: ఎన్‌ఏడీ జంక్షన్‌లో పాదచారుడిపై ముగ్గురు వ్యక్తులు దౌర్జన్యం చేసి సెల్‌ఫోన్ లాక్కొనిపోయారు. ఈ ఘటనకు సంబంధించి ఎయిర్‌పోర్టు క్రైం ఎస్‌ఐ కాంతారావు తెలిపిన వివరాలు... శుక్రవారం రాత్రి 3 గంటల సమయంలో దొడ్డి నాయుడుతరుణ్ మురళీనగర్‌లోని ఆక్వా టెక్నాలజీలో విధులు ముగించుకుని వస్తున్నాడు. ఎన్‌ఏడీ జంక్షన్‌లో ద్విచక్ర వాహనంపై వచ్చి టైమ్ అడిగారు. దీంతో సెల్‌ఫోన్ చూసి టైమ్ చెబుతున్న సమయంలో చేతిలో సెల్‌ఫోన్‌ను ఒక్క ఉదుటున లాక్కొని ద్విచక్రవాహనంపై పారిపోయారు. దీంతో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టారు. నిందితులు గవర జగ్గయ్యపాలేనికి చెందిన ముగ్గురు వ్యక్తులు గుర్రాల రాజ్‌కుమార్, గుమ్మడి పైడిరాజు, నల్లా కార్తీక్‌గా గుర్తించారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించారు. వారి నుంచి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.